క్లుప్తంగా

పరామర్శ

చల్లపల్లి: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు మోపిదేవి ద్వారకానాథ్‌ను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం స్థానిక అగ్రహారంలోని ఇంటి వద్ద కోలుకుంటున్నారు. ఆయన్ను సోమవారం ఎమ్మెల్యే రమేష్‌బాబు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ (నాని), జేసీఎస్ మండల కన్వీనర్ యడ్ల జగదీష్, ఏఎంసీ డైరెక్టర్ మోతుకూరి ఏడుకొండలు, భాగ్యారావు, అంజియ్య పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల ఆర్థికాభ్యున్నతికి కృషి



పెడన: పాల ఉత్పత్తిదారుల ఆర్థికాభ్యున్నతికి కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తోందని సంస్థ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. పెదపుల్లపాడు, చోడవరం పాల ఉత్పత్తిదారుల అసోసియేషన్లను సోమవారం సందర్శించిన ఆంజనేయులు పాల ఉత్పత్తిదారుల సమస్యలను తెలుసుకున్నారు. మేలైన యాజమాన్య పద్ధతులు, మెరుగైన పశుపోషణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా పాలకవర్గ సభ్యుడు అర్జా వెంకటనగేష్, గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ నాగరాజు, ఊచా జ్వాలబాబు, పెయ్యేటి బసవరాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో తహసీల్దార్ సమీక్ష

అవనిగడ్డ: తహసీల్దార్ సునీల్‌కుమార్ ఆయన కార్యాలయంలో సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎన్నికల కోడ్‌లోని నిబంధనలు తప్పకుండా అమలయ్యేలా చూడాలని ఆయన సూచించారు.

ఆకుమర్రులో దళితుల ఆత్మీయ సమ్మేళనం

గూడూరు: గూడూరు పీఏసీఎస్ చైర్మన్ కారుమంచి కామేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని ఆకుమర్రులో దళితుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సమ్మేళనానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఎస్సీలు తరలివచ్చారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ ఐదేళ్ల జగనన్న పాలనలో ఎస్సీలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఎస్సీలకు గతంలో ఎన్నడూ లేనంత ప్రాధాన్యం, గుర్తింపు ఇచ్చిన ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో దళితులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గూడూరు మండల అధ్యక్షుడు పర్లం పెదబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, ఎస్సీ నాయకులు లింగం విజయ్, లంకా సుబ్రహ్మణ్యం, చిన్నం చంటబ్బాయి. వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం పెంపునకు ప్రత్యేక చర్యలు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం పెంపునకు ప్రత్యేక చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం కానూరు, పోరంకి, యనమలకుదురు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. చెత్త సేకరించే వాహనాలు క్రమం తప్పకుండా ప్రతి ఇంటికీ వెళ్లి సేకరించాలన్నారు.కుండీల వద్ద చెత్త లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని కార్మికులను ఆదేశించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని చెప్పారు. పోరంకిలో రెండు రోజులుగా తాగునీరు లేక జనాలు ఇబ్బందులు పడటంతో కమిషనర్ వెంకటేశ్వరరావు స్వయంగా వచ్చి పరిస్థితులు పరిశీలించారు. ధ్వంసమైన పైప్‌లైన్లను దగ్గర ఉండి మరమ్మతులు చేయించారు. భవిష్యత్తులో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సమాజ సేవ చేయాలి

పెనమలూరు: ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సమాజ సేవ చేయాలని జేఎన్‌టీయూకే ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ శ్యామ్ తెలిపారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం తాడిగడపలో సోమవారం నుంచి 7 రోజుల పాటు నిర్వహించనున్న సేవా శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. వివిధ విభాగాల్లో చదువుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా సమాజ సేవ చేయాలని సూచించారు. ఆడ పిల్లలకు చదువుపై ఉపయోగాలు, ప్రాథమిక విద్యపై అవగాహన, ఓటు హక్కు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, స్వచ్ఛభారత్, రోడ్ సేఫ్టీ, పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాలు తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ బావినేని పాండురంగారావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, పద్మజానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.వెంకటేశ్వరరావు, టి.వెంకటేశ్వరరావు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చా

- వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్
- ఎమ్మెల్యే సింహాద్రితో కలిసి కోడూరులో పర్యటన



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న పార్టీ నేతలు, కార్యకర్తలు



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్‌బాబు

కోడూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధాంతాలు నచ్చి ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని వైఎస్సార్ సీపీ బందరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ చెప్పారు. సోమవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుతో కలిసి కోడూరులో పర్యటించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద మండల నేతలతో పరిచయ కార్యక్రమం జరిగింది. తన తండ్రి సింహాద్రి సత్యనారాయణ దేవుడి మంత్రిగా మంచి పేరు తెచ్చుకున్నారని, తండ్రి అడుగు జాడల్లో నడుస్తానని చంద్రశేఖర్ అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మంచి చేయడానికి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నారన్నారు. బందరులో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ దివిసీమ ప్రజలకు వరంలాంటిందని, పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. నియోజకవర్గంలోని సమస్యల గురించి, ఇక్కడ ప్రజల జీవన విధానాలపై నిత్యం ముఖ్యమంత్రితో చర్చిస్తునే ఉండేవాడినని, ఇక్కడ పరిస్థితులపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పూర్తి అవగాహన ఉందని తెలిపారు. తనను ఎంపీగా గెలిపించడంతో పాటు పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

దివిసీమ ప్రజలకు ప్రాణదాత..

డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ దివిసీమ ప్రజలకు ప్రాణదాత అని పార్టీ నేతలు కొనియాడారు. నియోజకవర్గం నుంచి తన వద్దకు వైద్యం కోసం ఏవరైనా వెళ్తే తక్కువ ఖర్చుతో వైద్యసేవలందించి, వారి ప్రాణాలను నిలబెట్టారన్నారు. చాలా మంది క్యాన్సర్ రోగులకు ఉచితంగా సేవలందించి గుర్తింపు తెచ్చుకున్నారని పార్టీ నేతలు చంద్రశేఖర్‌ను ప్రశంసించారు. ఆయన చేసిన సేవలను అభినందిస్తూ చంద్రశేఖర్‌ను పార్టీ నేతలు శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు.

నేతలు, కార్యకర్తలు కృషి చేయాలి

రాబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించడానికి పార్టీ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని సింహాద్రి రమేష్ బాబు కోరారు. మరో 55 రోజుల పాటు ప్రతి కార్యకర్త ప్రచారాన్ని ముమ్మరం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఐదేళ్ల పాటు జరిగిన సంక్షేమ, అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని రమేష్‌బాబు కోరారు. గ్రామ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, గృహ సారథులు ఎన్నికల సరళిపై దృష్టి సారించాలన్నారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటసత్యనారాయణ, పార్టీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి వీరవెంకట నారాయణరావు, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ చంద్రశేఖరరావు, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ ఉసవయ్య, సచివాలయాల మండల కన్వీనర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మరకత శివలింగం నగరోత్సవం



మచిలీపట్నంటౌన్: స్థానిక ఖొజ్జిలిపేట జొన్నవిత్తులవారి వీధిలో పునః ప్రతిష్ఠ చేసే మరకత శివలింగం, నంది విగ్రహం, భుజంగేశ్వర స్వామి వారి విగ్రహాలను సోమవారం పురవీధుల్లో ఊరేగించారు. చక్కా నాగేశ్వరరావు, రోజారమణి దంపతుల ఇంటి నుంచి 108 కలశాలలో అభిషేక ద్రవ్యాలు, సుగంధ ద్రవ్యాలు 54 కావిళ్లతో, 108 మంది సువాసినిలు జ్యోతులతో మేళతాళాలతో స్వామివారి విగ్రహాలను నగరోత్సవం జరిపారు.

పెడనలో హెల్ప్‌లైన్ ఏర్పాటు

పెడన: పెడన తాహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సాధారణ ఎన్నికల నేపథ్యంలో హెల్ప్‌లైన్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి పి. వెంకటరమణ తెలిపారు. 24 గంటలూ అందుబాటులో ఉండే హెల్ప్‌లైన్ నంబరు 08672-248341కు ఫోన్ చేసి ఎటువంటి సమస్యలున్నా ఫిర్యాదు చేయవచ్చని ఆయన చెప్పారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు



నాగాయలంకలో తమ నంబర్లు ఏ రూమ్‌ల్లో ఉన్నాయో చూసుకుంటున్న విద్యార్థులు



నాగాయలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో మెడికల్ క్యాంప్



చల్లపల్లిలో పరీక్షలకు ఉత్సాహంగా వెళ్తున్న విద్యార్థులు



గూడూరు పరీక్ష కేంద్రం వద్ద భద్రత పరిశీలిస్తున్న సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్సై వీర్రాజు



బంటుమిల్లి కొమ్మారెడ్డి సెంటర్లో బారులు తీరిన విద్యార్థులు

నాగాయలంక: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని తలగడదీవి జెడ్పీ ఉన్నత పాఠశాల, నాగాయలంక-ఏ, నాగాయలంక-బీ పరీక్ష కేంద్రాల్లో 384మందికి 335మంది విద్యార్థులు తొలిరోజు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. నాగాయలంక రెండు కేంద్రాల్లో 34మంది, తలగడదీవి కేంద్రంలో 15మంది మొత్తం 49మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మూడు కేంద్రాల్లో నాగాయలంక, భావదేవరపల్లి, ఏటిమొగ, తలగడదీవి జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఎదురుమొండి అప్‌గ్రేడ్ హైస్కూలు, రెండు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఈ కేంద్రాల్లో 20రూమ్స్ కేటాయించగా, 23మందిని ఇన్విజిలేటర్స్‌గా, ముగ్గురు చీఫ్ సూపరింటెండెంట్‌లు, మరో ముగ్గురు డిపార్ట్‌మెంటల్ అధికారులు విధులు నిర్వర్తించారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాల్లో తమకు కేటాయించిన రూమ్‌ల్లోకి చేరుకున్నారు. ఇన్విజిలేటర్లు సూచనలు, నిబంధనలు చెప్పారు. తొలిరోజు విద్యార్థులు తమ తల్లిదండ్రులతో వచ్చి హాల్‌టికెట్ల నంబర్లు ఏ రూమ్‌లో కేటాయించారో డిస్‌ప్లే బోర్డులలో చూసుకుని రూమ్‌లకు పరుగులు తీశారు. మండల వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల ప్రాంగణంలో మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి ప్రాథమికంగా అవసరమైన మందులు సిద్ధంగా ఉంచారు. ఇద్దరు కానిస్టేబుల్స్‌తో పోలీసు బందోబస్తు చేశారు. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈవో-2 అన్నపరెడ్డి రామారావు చెప్పారు.

కృత్తివెన్ను: పది పరీక్షలకు మండలంలో సంగమూడి, లక్ష్మీపురం, పోడు ఉన్నత పాఠశాలలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. సోమవారం పరీక్షకు సంగమూడి కేంద్రంలో 139 మందికి 114 మంది హాజరు, లక్ష్మీపురంలో 106 మందికి 104, పోడులో 190 మందికి 175 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. మొత్తం 435 మందికి 393 మంది హాజరవ్వగా 42 మంది మొదటి రోజు పరీక్షకు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, సౌకర్యాలతో పాటు వైద్య సదుపాయం కూడా అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.

పెడన: మండలంలో 759 మంది విద్యార్థులకు 709 మంది మొదటి రోజు పరీక్షలకు హాజరయ్యారు. 50 మంది గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

అవనిగడ్డ: అవనిగడ్డలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎన్ఆర్ఐ వికాస్ స్కూల్, శ్రీచైతన్య స్కూల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 593 మందికి తొలిరోజు పదిమంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్టు ఎంఈవో ఎస్.శివశంకరరావు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 204కి 198 మంది హాజరవ్వగా ఆరుగురు గైర్హాజరయ్యారు. ఎన్ఆర్ఐ వికాస్ స్కూల్‌లో 229 మందికి 226 హాజరవ్వగా ముగ్గురు గైర్హాజరు, శ్రీచైతన్య స్కూల్‌లో 170కి 169 మంది హాజరవ్వగా ఒక్కరు గైర్హాజరయ్యారు.

మోపిదేవి: పది పరీక్షలు మండలంలోని మూడు సెంటర్లలో ప్రశాంతంగా నిర్వహించారు. సోమవారం ఉదయం మోపిదేవి జెడ్పీ పాఠశాలలో 177 మందికి 9 మంది గైర్హాజరవ్వగా, 168 మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ మురళీకృష్ణ తెలిపారు. స్థానిక గురుకుల పాఠశాలలో 57 మందికి.. ఒక్కరు గైర్హాజరవ్వగా 56 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. పెదకళ్లేపల్లి జెడ్పీ పాఠశాలలో 97 మందికి నలుగురు గైర్హాజరవ్వగా 93 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు వివరించారు.

చల్లపల్లి: చల్లపల్లిలోని ఎస్ఆర్‌వైఎస్‌పీ హైస్కూల్లో రెండు పరీక్ష కేంద్రాలు, విజయ హైస్కూల్, రామానగరం శ్రీచైతన్య స్కూల్, మాజేరు జెడ్పీ హైస్కూలులో ఒక్కొక్క పరీక్ష కేంద్రం నిర్వహించారు. మొత్తం 839 మందికి గాను 826 మంది హాజరయ్యారు. అధికారుల పర్యవేక్షణలో, పోలీసు బందోబస్తు మధ్య పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించారు.

బంటుమిల్లి: మండలంలోని ఏడు కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా మొదలయ్యాయి. ఏడు కేంద్రాల్లో 776 మందికి 686 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఎంఈఓ త్రిపురసుందరీదేవీ తెలిపారు. తొలి పరీక్ష కావడంతో విద్యార్థులు ఉదయం తొమ్మిది గంటలకే కేంద్రాల వద్దకు చేరుకుని తమకు కేటాయించిన గదులు తెలుసుకుని ఉరుకులు, పరుగులు పెట్టారు.

గూడూరు: మండల కేంద్రం గూడూరు, మల్లవోలు, కంకటావ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు మొదటి రోజు పరీక్షలకు హాజరయ్యారు. గూడూరులోని పరీక్ష కేంద్రంలో కప్పలదొడ్డి, తరకటూరు, గూడూరు హైస్కూళ్లకు చెందిన 189 మంది, కంకటావ కేంద్రంలో కంకటావ, ముక్కొల్లుకు చెందిన 56 మంది, మల్లవోలు కేంద్రంలో మల్లవోలు, రాయవరం హైస్కూళ్లకు చెందిన 153 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 27 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో శేఖర్‌సింగ్ తెలిపారు. పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్, గూడూరు ఎస్సై ఐ.వీర్రాజులు పరీక్ష కేంద్రాలను సందర్శించి భద్రతను సమీక్షించారు.

కోడూరు: కోడూరు మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల వద్ద రెగ్యులర్, సప్లమెంటరీకి సంబంధించి 378 మందికి 352 మంది విద్యార్థులు తొలి రోజు పరీక్షలు రాశారు. 26మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు ఎంఈఓ టి.వి.ఎం. రామదాసు తెలిపారు.

ఘంటసాల: శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్లో 113 మంది విద్యార్థులకు 101 మంది హాజరుకాగా, ఘంటసాల జెడ్పీ హైస్కూల్లో 82 మంది విద్యార్థులకు 80 మంది , కొడాలి జెడ్పీ హైస్కూల్లో 65 మందికి 60 మంది హాజరవ్వగా మండలం మొత్తం 19 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో-1 శివశంకరరావు తెలిపారు. ఘంటసాల జెడ్పీ హైస్కూల్లో పోలీసు బందోబస్తును ఎస్ఐ ప్రతాప్ రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో2 ఎండీ మోమిన్ తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో..

మచిలీపట్నం: మచిలీపట్నం నియోజకవర్గంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలోని నగర పాలకసంస్థ పరిధిలో 15, మండలంలో మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. నియోజకవర్గంలో 2,826 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 2,713 మంది హాజరయ్యారు. 113 మంది గైర్హాజరయ్యారు. మచిలీపట్నం నగరంలో 2,465 మంది విద్యార్థులకు 2,392 మంది హాజరయ్యారు. 73 మంది పరీక్షకు హాజరుకాలేదు. మచిలీపట్నం రూరల్‌లో 361 మంది హాజరుకావాల్సి ఉండగా 321 మంది హాజరుకాగా, 40 మంది రాలేదు. నగరంలోని హైనీ స్కూల్‌లోని పరీక్ష కేంద్రాన్ని బందరు ఆర్డీవో వాణి పరిశీలించారు.



హైనీ స్కూల్ పరీక్ష కేంద్రంలో వివరాలు చూసుకుంటున్న విద్యార్థులు

దేవాంగుల సంక్షేమానికి కృషి

ఆత్మీయ సమ్మేళనంలో ఉప్పాల రాము



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పెడన అభ్యర్థి ఉప్పాల రాము

పెడన: దేవాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) తెలిపారు. పట్టణంలోని పోలవరపుపేట దేవాంగ కల్యాణ మండపంలో దేవాంగుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా ఉప్పాల రాము, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాంగుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడ్డారన్నారు. చేనేత జీవనాధారమైన కార్మికులకు వైఎస్సార్ నేతన్న నేస్తం కార్యక్రమం ద్వారా ఏడాదికి రూ.24 వేలు అందిస్తున్నారన్నారు. 50 ఏళ్లు నిండిన నేత కార్మికులకు రూ.3 వేల సామాజిక పెన్షన్ అందిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జగనన్నకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి ప్రసాద్, మెట్ల గోపి, పిచ్చుక సతీష్, యర్రా టార్జన్, దేవాంగ ప్రముఖులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చేపల చెరువులో విషప్రయోగం

చేపలు మృత్యువాత



విష ప్రయోగం కారణంగా చనిపోయి చెరువులో పైకి తేలిన చేపలు

బంటుమిల్లి: రెండు కుటుంబాల మధ్య ఉన్న భూ వివాదం.. కక్ష సాధింపులో భాగంగా చెరువులో విష ప్రయోగం చేయడంతో లక్షలాది రూపాయల విలువ చేసే చేపలు మృత్యువాత పడ్డాయి. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మండల పరిధిలోని రామవరపుమోడిలో గూడవల్లి పాండురంగారావు భార్య లక్ష్మికి సుమారు 3 ఎకరాల చెరువు భూమి ఉంది. దీనిలో చేపలు వేసి 8 నెలలుగా పెంచుతున్నారు. ఇంట్లో శుభకార్యం అనంతరం చేపలు పడదామని అనుకుంటున్న క్రమంలో ఈ నెల 17వ తేదీ ఉదయం చెరువు వద్దకు వెళ్లేటప్పటికి సుమారు రూ. 7 లక్షల విలువ చేసే చేపలు మృతి చెంది చెరువులో తేలి ఉన్నాయి. ఘటనపై పాండు పోలీసువారికి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇది ఇలా ఉంటే గ్రామానికి చెందిన కాగిత వెంకటేశ్వరరావుతో పాండుకు కొన్నేళ్లుగా మరో భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. వీటి నేపథ్యంలో వెంకటేశ్వరరావుపై పోలీసులు నాలుగు కేసులు నమోదు చేశారు. వివాదస్పద భూమిపై రెవెన్యూ వారు 145 నోటీసు ఇచ్చి భూమి జోలికి వెళ్లద్దని ఆదేశాలు ఇచ్చారు. వీటిని ధిక్కరించిన వెంకటేశ్వరరావు భూమిని ఆక్రమించి గట్టు ఏర్పాటు చేశాడు. దీనిపై ఇద్దరి మధ్య ఈ నెల 16వ తేదీన చెరువు వద్ద ఘర్షణ జరిగింది. పోలీసులు చెరువును పరిశీలించి వెంకటేశ్వరరావును మందలించి కొత్త గట్టును తొలగించాలని హెచ్చరించారు. దీంతో కక్ష పెట్టుకున్న వెంకటేశ్వరరావు నా చెరువులో పురుగుమందు కలిపి చేపలు చనిపోవడానికి కారణమయ్యాడంటూ పాండు అతనిపై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

సంక్షేమ సారథి జగనన్న



పుల్లపాడు గ్రామంలో గీత కార్మికుడితో మాట్లాడుతున్న ఉప్పాల హారిక, రాము

పెడన: పేదల భవిష్యత్తును సంక్షేమ ఫలాలతో తీర్చిదిద్దిన రథసారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒక్కరేనని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. ప్రజాదీవెన కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పుల్లపాడు గ్రామంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ పెడన అసెంబ్లీ అభ్యర్థి ఉప్పాల రాము గ్రామస్తులకు కరపత్రాలు అందజేస్తూ ప్రభుత్వం నుంచి అందిన ఫలాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. పెడన నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని రాంప్రసాద్ కుమారుడిగా మీ వాడిగా మీ ముందుకు వచ్చానని ఆశీర్వదించాలంటూ రాము గ్రామస్తులకు అభివాదాలు చేస్తూ కరపత్రాలు అందజేశారు. తొలుత స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి హారిక, రాము పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రామానాయుడు, దావు భైరవలింగం, మాజీ ఎంపీపీ ఆర్. అచ్యుతరావు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహిళలు హారిక, రాముకు ఘన స్వాగతం పలికారు.

కొనసాగుతున్న ఫ్లెక్సీలు, హోర్డింగుల తొలగింపు

గూడూరు: సార్వత్రిక ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో గూడూరులో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, హోర్డింగుల తొలగింపు ముమ్మరంగా సాగుతోంది. తహసీల్దార్ ఎస్ఎస్ శాంతి ఆదేశాల మేరకు ప్రధాన రహదారులతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో పోస్టర్ల తొలగింపు ప్రక్రియ రెండు రోజులుగా చురుగ్గా జరుగుతోంది. గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడం, పార్టీ జెండా దిమ్మెలకు నల్లరంగులు పూశారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విజేతలైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పుష్ప

రావర్ల(పామర్రు): జాతీయ స్థాయి కుంగ్-ఫూ టోర్నమెంట్‌లో తమ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని మదర్‌థెరిస్సా స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్.పుష్పయాకోబ్ పేర్కొన్నారు. మండలంలోని రావర్లగ్రామంలోని మదర్‌థెరిస్సా స్కూల్లో సోమవారం విజేతలైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ ఎన్టీఆర్ జిల్లా నందిగామలో జరిగిన కుంగ్-ఫూ కరాటే జాతీయ స్థాయి టోర్నమెంట్ చాంపియన్‌షిప్ పోటీలలో తమ పాఠశాలకు చెందిన రెండో తరగతి విద్యార్థులు గల్లా సిద్ధార్థ, చింతల రేవంత్ ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి బహుమతి గెలుచుకుని బంగారు పతకాన్ని సాధించి సర్టిఫికెట్లను పొందారన్నారు.

భీమేశ్వర స్వామి ఆదాయం రూ. 3.76 లక్షలు



గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్డులో ఉన్న శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానం(పెద్దశివాలయం) హుండీల కానుకల లెక్కింపు సోమవారం జరిగింది. కార్య నిర్వహణాధికారి కె.మౌనిక, పాలక మండలి సభ్యుల సమక్షంలో జరిగిన లెక్కింపులో 108 రోజులకు రూ.3,76,515 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చందరాల హరిరాం బాబు, దేవస్థానం పాలక మండలి అధ్యక్షుడు పంచకర్ల వెంకటేశ్వరరావు, సభ్యులు టీఎన్‌వీ సాంబశివరావు, కాంచనకుమారి, పి. సత్యనారాయణ, వజ్రలత, నాగమణి పాల్గొన్నారు.

గౌరీశంకర స్వామి ఆదాయం రూ.1.34 లక్షలు

స్థానిక గౌరీశంకరపురంలో వేంచేసియున్న శ్రీ గౌరీశంకరస్వామి వారి దేవస్థానం(చిన్న శివాలయం) హుండీ కానుకలను లెక్కించారు. 57 రోజులకు గాను రూ.1,34,183 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు. ఆలయ పాలక మండలి చైర్మన్ డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్, సభ్యుడు బాలకృష్ణ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.